వాననీటి కాల్వల పనులు

త్వరితగతిన పూర్తి చేయండి

● సీఎం స్టాలిన్ ఆదేశం



ఆళ్వార్‌పేటలో వాననీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపడుతున్న వాననీటి, మురుగునీటి కాల్వల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం స్టాలిన్ ఆదేశించారు. ఆళ్వార్‌పేట ప్రాంతంలో జరుగుతున్న వాననీటి కాల్వలు, మురుగునీటి కాల్వల విస్తరణ పనులను ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ తనిఖీ చేశారు.. తేనాంపేట జోన్, 118వ వార్డు పరిధిలో ఉన్న టీటీకే రోడ్డు వద్ద కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వాననీటి కాల్వ పనులు, మహానగర నీటి సరఫరా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న తాగునీటి కాల్వల పనులను ఆయన పరిశీలించారు. ఇదే విధంగా వీనస్‌కాలనీలోని జయమ్మాళ్‌రోడ్డు, ఇలంగో రోడ్డు క్రాస్‌స్ట్రీట్, ఇలంగో రోడ్డు, పోయస్‌రోడ్డు, వెంకటరత్నం రోడ్డు, రాజకృష్ణారోడ్డు, నల్లాన్ పోయస్ రోడ్డు, వరదరాజపురం మెయిన్‌రోడ్డు, శ్రీమాన్ శ్రీనివాసన్ రోడ్డు సహా పది ప్రాంతాల్లో రూ.8.21 కోట్లతో జరుగుతున్న వాననీటి కాల్వల నిర్మాణ పనులను తనిఖీ జరిపారు. స్టాలిన్‌తో పాటు మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎమ్మెల్యే డాక్టర్ ఎళిళన్, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఎన్.సిట్రరసు, కమిషనర్ జే కుమరగురుబరన్, చెన్నై మెట్రోవాటర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ టీజీ విజయ్ తదితరులు పర్యటించారు.

కరూర్ వేలుచ్చామిపురంలో

'సిట్' విచారణ



తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిట్ అధికారి అస్రా గార్గ్, ఎస్పీలు విమలా, శ్యామలాదేవి తదితర అధికారులు

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత విజయ్ సెప్టెంబర్ 27 రాత్రి నిర్వహించిన రోడ్‌షో సందర్భంగా తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయిన ప్రదేశం వద్ద ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారి ఐజీ అస్రా గార్గ్ విచారణ ప్రారంభించారు. హైకోర్టు ఉత్తర్వు మేరకు కరూర్ విషాద సంఘటన విచారణ బాధ్యతలను ఆయన స్వీకరించిన విషయం తెలిసిందే. శనివారం సాయంత్రం చెన్నై చేరుకున్న కరూర్ పోలీసు అధికారులు కేసుకు సంబంధించిన అన్ని ఫైళ్ళను ఆయనకు అందజేశారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారి ఐజీ అస్రా గార్గ్, ఎస్పీలు విమలా, శ్యామలాదేవి తదితరులు ఆదివారం మధ్యాహ్నం వేలుచ్చామిపురం వద్ద విచారణ ప్రారంభించారు. టీవీకే నేత విజయ్ ప్రచార వాహనంపై నిలిచి ప్రసంగిస్తున్నప్పుడు జరిగిన సంఘటనలపై ఆ ప్రాంతంలో వ్యాపారుల వద్ద, ఇళ్ళలో నివసిస్తున్నవారిని ప్రశ్నించారు. తొక్కిసలాట ఎలా జరిగింది? అక్కడి జనరేటర్ గదిలో ఎంతమంది చొరబడ్డారు. అక్కడి చెట్టుపైనున్నవారంతా ఎలా పడ్డారు? అంటూ వరుసగా ప్రశ్నించి వ్యాపారులు, స్థానికులు తెలిపిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత తొక్కిసలాటలో మృతిచెందినవారి ఇళ్ళకు వెళ్ళి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. విజయ్ ప్రచార స్థలానికి ఎందుకు వెళ్ళారు? అక్కడ ఏం జరిగింది? అంటూ మృతుల కుటుంబ సభ్యులను ప్రశ్నించి, వివరాలు తీసుకున్నారు.

సిట్‌లో మరో 8 మంది ..

ఐజీ అస్రా గార్గ్ నాయకత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందంలో మరో ఎనిమిది మంది పోలీసు అధికారులను సభ్యులుగా నియమించారు. దీంతో ఈ బృందంలోని సభ్యుల సంఖ్య 10కి చేరింది. వీరిలో డీఎస్పీలు, ఏడీఎస్పీలు, సూపరింటెండెంట్లు, ఫోరెన్సిక్ నిపుణులున్నారు. సోమవారం నుండి ఈ పదిమంది సభ్యులతో కలిసి విచారణ ముమ్మరం చేయనున్నట్లు ఐజీ అస్రాగార్గ్ తెలిపారు.

విజయ్ బస్ డ్రైవర్‌పై కేసు

ఇదిలా ఉండగా టీవీకే నేత విజయ్ సెప్టెంబరు 27 మధ్యాహ్నం నామక్కల్‌లో ప్రచారం ముగించుకుని (ప్రచారవాహనం) బస్సులో వెళ్తుండ గా వందల సంఖ్యలో యువకులు బైకులపై వెంబడిస్తుండగా మూడు బైకుల్ని ఆ బస్సు పక్కవాటున ఢీకొంది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వీక్షించిన హైకోర్టు న్యాయమూర్తి సెంధిల్‌కుమార్ పోలీసులు ఆ ప్రమాదం పై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. అవసరమైతే విజయ్ ప్రచార వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఆ ప్రకారమే కరూర్ వేలాయుధపురం పోలీసులు విజయ్ ప్రచార వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ప్రచార వాహ నం బైకులను ఢీకొన్న ప్రాంతం వేలాయుధపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఉండడంతో అక్కడి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అందులో విజయ్ ప్రచార వాహనం డ్రైవర్ పేరు లేకపోవటం విశేషం. ప్రచార వాహనం బైకులను ఢీకొన్న కేసుకు సంబంధించి వేలాయుధపురం పోలీసులు చెన్నైలో పయనూరు వద్ద విజయ్ నివాసం వద్దనున్న వాహనాన్ని ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయం స్వాధీనం చేసుకుంటారని తెలుస్తోంది.

త్వరలో వళ్లలార్ సన్మార్గ

అంతర్జాతీయ మహానాడు

● దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు



కడలూరు వళ్ళలార్ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న మంత్రులు ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, పీకే శేఖర్‌బాబు

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో నవంబర్ లేదా డిసెంబర్‌లో వళ్ళలార్ సన్మార్గ అంతర్జాతీయ మహానాడును భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. ఆదివారం ఉదయం కడలూరు జిల్లా వడలూరులోని అరుళ్‌ప్రకాశ వళ్ళలార్ దేవాలయంలో వళ్ళలార్ 203వ అవతార దిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో మంత్రి పీకే శేఖర్‌బాబు, వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం పాల్గొని సన్మార్గ పతాకాన్ని ఆవిష్కరించి, భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ఆ ఆలయానికి చేరువగా వళ్ళలార్ అంతర్జాతీయ కేంద్రం 'బి' విభాగంలో జరుగుతున్న నిర్మాణ పనులను మంత్రులిద్దరూ పరిశీలించారు. ఆ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ రాజధాని నగరం చెన్నైలో వళ్ళలార్ నివసించిన (మింట్) ప్రాంతానికి వళ్ళలార్‌నగర్ అని, అక్కడి బస్‌స్టేషన్‌కు కూడా ఆ మహాపురుషుడి పేరు పెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధికే దక్కుతుందని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో వళ్ళలార్ బస్‌స్టేషన్‌లో రూ.6 కోట్లతో అన్ని సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. వీటన్నింటి కంటే మకుటాయమానంగా నవంబర్ లేదా డిసెంబర్‌లో 10 వేల మంది ప్రతినిధులతో వళ్ళలార్ అంతర్జాతీయ సన్మార్గ మహానాడు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ అంగీకరించారని తెలిపారు. ఆ మహానాడులో 2000 మందికిపైగా మహిళా ప్రతినిధులు హాజరవుతారని, వళ్ళలార్ లాగే అహింసా విధానాలను బోధించిన సన్మార్గ ప్రముఖులు 25 మందిని ఘనంగా సత్కరించనున్నామని శేఖర్‌బాబు వివరించారు.

అసెంబ్లీ సమావేశాలు

ఎన్నిరోజులు?

● 13న సభా వ్యవహారాల మండలి సమావేశం

ప్యారీస్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 14న ప్రారంభంకానున్న నేపథ్యంలో, ఈ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలన్న దానిపై సభా వ్యవహారాల మండలి సమావేశం 13న జరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి అసెంబ్లీ సమావేశాలు జనవరి 6న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగంపై నాలుగు రోజులు జరిగిన చర్చల్లో అఖిలపక్షాల సభ్యులు పాల్గొన్నారు. ఆ తర్వాత మార్చి 14న రాష్ట్రప్రభుత్వ 2025-2026 వార్షిక బడ్జెట్, 15వ తేదీ వ్యవసాయ బడ్జెట్లను ప్రవేశపెట్టారు. 24వ తేదీ నుంచి శాఖల వారీగా దాఖలు చేసిన పద్దులపై ప్రారంభమైన చర్చలు ఏప్రిల్ 26వ తేదీ వరకు జరిగాయి. దీంతో తేదీ ప్రకటించకుండా స్పీకర్ అప్పావు అసెంబ్లీని వాయిదా వేశారు. శాసన సభ నిబంధనల ప్రకారం అసెంబ్లీ సమావేశం ముగిసిన 6 నెలల్లో మరో సమావేశం నిర్వహించాల్సివుంది. దీనిని బట్టి ఈ నెల 14వ తేదీ అసెంబ్లీ సమావేశం ప్రారంభమవుతోందని ప్రకటించిన స్పీకర్ అప్పావు మొదటి రోజు మృతిచెందిన శాసన సభ్యులకు సంతాపం తెలుపుతూ తీర్మానం ఆమోదించి సభను వాయిదా వేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అదనపు వ్యయాలకు సంబంధించిన ఆర్థిక అనుబంధ పద్దులు సమర్పించడంపై చర్చలు జరుగుతాయని తెలిపారు. ఆ మేరకు ఈసారి అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులు నిర్వహించాలన్న దానిపై సభా వ్యవహారాల మండలి సమావేశం స్పీకర్ అప్పావు అధ్యక్షతన ఆయన కార్యాలయంలో ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుంది. ఇందులో పాల్గొనాల్సిందిగా అఖిలపక్షాల సభ్యులు, పార్టీ విప్‌లకు ఆహ్వానాలు పంపినట్లు సచివాలయం తెలిపింది.

ప్రధాన వాణిజ్య కేంద్రాల్లో

దీపావళి భద్రతా ఏర్పాట్లు

18 వేల మంది పోలీసులతో బందోబస్తు

అడయార్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. భద్రత కోసం ఏకంగా 18 వేల మంది పోలీసులను నియమించనున్నారు. ముఖ్యంగా దీపావళి షాపింగ్ జోరుగా సాగే టి.నగర్, పురుషవాక్కం వంటి ప్రధాన వాణిజ్య కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రధానంగా టి.నగర్‌లోని రంగనాథన్ వీధిలో ఏకంగా ఐదు ప్రాంతంల్లో సీసీ కెమెరాలతో టవర్లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే, టి.నగర్ బస్సు డిపో సమీపంలో మరో నిఘా టవర్ నిర్మించనున్నారు. అంతేకాకుండా టి.నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఏకంగా 80కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి రద్దీ నిశితంగా పర్యవేక్షించనున్నారు. పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశాల మేరకు అదనపు పోలీస్ కమిషనర్ల పర్యవేక్షణలో టి. నగర్ డిప్యూటీ కమిషనర్ గుత్తాలింగం, అసిస్టెంట్ కమిషనర్ సురేష్, సీఐ రంజిత్ పోలీసులు విధుల్లో నిమగ్నం కానున్నారు. వీటితో పాటు పురసైవాక్కం, అడయార్, వాషర్‌మెన్‌పేట, ప్యారీస్, అన్నా నగర్, వడపళని, ట్రిప్లికేన్, మైలాపూర్ తదితర ప్రాంతాల్లో కూడా భారీ భద్రత ఏర్పాటు చేయనున్నారు. అలాగే, అనుమానితులను అదుపులోకి తీసుకోనున్నారు. దీపావళి పండగ షాపింగ్ సమయంలో నగర వాసులు కూడా అప్రమత్తంగా ఉంటూ, పోలీసులకు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ అరుణ్ కోరారు.



టి.నగర్ రంగనాథన్‌వీధి వాచ్‌టవర్‌పై నుంచి పరిశీలిస్తున్న లేడీ కానిస్టేబుల్

ఆర్బీఐ

పరీక్షా తేదీని మార్చాలి

● ఎంపీ వెంకటేశన్ వినతి

అడయార్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు ముందు రోజు భారత రిజర్వు బ్యాంకు ఆఫీసర్స్ ఎంపిక కోసం నిర్వహించనున్న పరీక్షా తేదీని మార్చాలని మదురై ఎంపీ వెంకటేశన్ కోరారు. ఈ విషయంపై ఆయన ఆర్బీఐ ఉన్నతాధికారులకు ఒక లేఖ రాశారు. ఈ నెల 18, 19వ తేదీల్లో గ్రేడ్ బి ఆఫీసర్ల రాత పరీక్షను ఆర్బీఐ నిర్వహించనుంది. ఈ నెల 20వ తేదీ దీపావళి పండుగ నేపథ్యంలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తిరిగి ఇంటికి చేరడం ఆలస్యమవుతుంది. అందువల్ల ఈ తేదీ మార్చాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

అకాల వర్షం...

విమానాల రాకపోకలకు

అంతరాయం



పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో ఆదివారం కురిసిన భారీవర్షానికి విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నగరంలో ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఈ క్రమంలో, మధ్యాహ్నం 2 గంటల సమయంలో హఠాత్తుగా కారుమబ్బులు కమ్ముకుని అకస్మాత్తుగా భారీవర్షం కురిసింది. రోడ్లపై నీరు చేరింది. భారీవర్షం కారణంగా నగరం నుంచి వెళ్లాల్సిన, రావాల్సిన విమానాలకు అంతరాయం కలిగింది. శ్రీలంక నుంచి 149 మంది ప్రయాణికులతో నగరానికి చేరుకున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం భారీవర్షం కారణంగా ల్యాండింగ్‌కు అనుకూలించకపోవడంతో, విమానాన్ని బెంగళూరు పంపించారు. అలాగే, ఢిల్లీ, ముంబై, కొచ్చిన్, గోవా, మదురై, తిరుచ్చి, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన సుమారు 10 విమానాలు ల్యాండింగ్‌కు అనుకూలించక ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. వర్షం తగ్గిన అనంతరం ఒకదాని తర్వాత మరొక విమానం ల్యాండింగ్ అయ్యాయి. అలాగే, నగరం నుంచి అబుదాబి, మస్కట్, ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, తూత్తుకుడి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన విమానాలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లాయి.

రిటర్న్ జర్నీ ఎఫెక్ట్....

టోల్‌గేట్ల వద్ద

బారులు తీరిన వాహనాలు

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సెలవుల తరువాత నగరానికి తిరుగు ప్రయాణం కావడంతో, టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులు తీరాయి. త్రైమాసిక పరీక్షల సెలవులు, ఆయుధ పూజ పండుగ సందర్భంగా నగరం నుంచి స్వగ్రామాలకు సుమారు 7 లక్షల మంది వెళ్లారు. సెలవుల అనంతరం సోమవారం నుంచి పాఠశాలలు, కార్యాలయాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, స్వగ్రామాల నుంచి ప్రజలు నగరానికి బయల్దేరారు. కార్లు సహా పలు వాహనాల్లో ప్రజలు ప్రయాణించారు. ఈ కారణంగా, ఉళుందూర్‌పేట, విక్రవాండి చెక్‌పోస్టుల వద్ద వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహనాలు ఆలస్యంగా టోల్ గేట్‌ను దాటాయి.



విక్రవాండి టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

కరూర్ మృతుల కుటుంబాలకు టీవీకే నేతల పరామర్శ

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కరూర్ వేలుచ్చామిపురం వద్ద టీవీకే నేత విజయ్ రోడ్‌షో సందర్భంగా తొక్కిలాటలో మృతి చెందినవారి కుటుంబాలను ఎట్టకేలకు ఆ పార్టీ స్థానిక నాయకులు పరామర్శించారు. ఆ దుర్ఘటన జరిగి తొమ్మిది రోజులు గడిచినా టీవీకే నేత విజయ్ గాని, ఆ పార్టీ కరూర్ జిలా నాయకులు గానీ మృతుల కుటుంబాలను పరామర్శించలేదు. ప్రస్తుతం విజయ్ మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు కరూర్ వెళ్లటానికి పోలీసుల భద్రత కోరుతూ లేఖ పంపారు. విజయ్ ఆదేశం మేరకు ఆ పార్టీ స్థానిక నాయకులు కొందరు కరూర్‌లో మృతుల కుటుంబీకులను కలిసి ఓదార్చారు. తొక్కిసలాటలో మృతి చెందిన వేలుచ్చామిపురం ప్రాంతానికి చెందిన బాలుడు గురువిష్ణు (2) కుటుంబీకులను టీవీకే వెస్ట్‌జోన్ కార్యదర్శి బాలసుబ్రమణి తదితరులు పరామర్శించారు. పార్టీ నేత త్వరలోనే కలుసుకుని మృతుల కుటుంబాలకు ప్రకటించిన ఆర్థిక సాయాన్ని అందజేస్తారని తెలిపారు.



బాలుడు గురువిష్ణు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీవీకే నేతలు

వారిని ప్రశ్నించకపోవడం గర్హనీయం : మాజీ మంత్రి

ఇదిలా ఉండగా కరూర్ దుర్ఘటనకు సంబంధించి టీవీకే నేతలు ఎవరినీ మీడియా ప్రశ్నించకపోవడం గర్హనీయమని మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ పేర్కొన్నారు. కోయంబత్తూరు డీఎంకే జిల్లా ఇన్‌ఛార్జిగా నియమితులైన సెంతమిళ్ సెల్వన్ ఆదివారం ఉదయం పార్టీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెంథిల్‌బాలాజీని కరూర్ విషాదంపై మీడియా ప్రశ్నించినప్పుడు తనకు తెలిసిన వివరాలను ప్రెస్‌మీట్‌లోనే వివరించానని, ఇక చెప్పడానికి తన వద్ద ఏవీ లేవన్నారు. కరూర్ దుర్ఘటనపై తనను పదే పదే ప్రశ్నించడం కన్నా టీవీకే నేత విజయ్ వద్దకు వెళ్ళి రోడ్‌షోకు 7 గంటలపాటు ఆలస్యంగా ఎందుకు వచ్చారు? ఐదు నిమిషాల్లో ప్రసంగాన్ని ముగించుకుని వెళ్లడానికి కారణాలేమిటి? డిసెంబర్‌లో జరగాల్సిన రోడ్‌షో ఇంత త్వరగా జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? అంటూ ప్రశ్నిస్తే వాస్తవాలు వెల్లడవుతాయని సెంథిల్ బాలాజీ సూచించారు.

శ్రీలంకకు వారంలో ఏడు రోజులూ

నౌకా యానం

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వారంలో ఆరు రోజులున్న శ్రీలంక నౌక సేవలు, ఇక నుంచి ఏడు రోజులు అందుబాటులోకి రానుంది. భారత్- శ్రీలంక మధ్య వర్తకం, పర్యాటక రంగం అభివృద్ధికి, నాగపట్టణం నుంచి శ్రీలంక కాంగేశన్‌కు ప్రయాణికుల నౌకా సేవలు గత 2023 అక్టోబరు 14వ తేది ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. అనంతరం, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'సిరియపాణి' అనే నౌక సేవలు ప్రారంభించారు. రుతుపవనాల కాలంలో వాతావరణం అనుకూలించక కొద్దిరోజులు ఈ సేవలు నిలిపివేశారు. తదుపరి ఈ సేవలను ప్రైవేటుకు అప్పగించారు. 150 మంది ప్రయాణికులు వెళ్లేలా 'శివగంగ' అనే చిన్నరకం నౌకా సేవలు గత సంవత్సరం ఆగస్టు 16వ తేది నుంచి ప్రారంభించారు. ప్రయాణికుల ఆదరణ పెరగడంతో, ప్రస్తుతం వారానికి ఆరు రోజులుగా ఉన్న నౌక సేవలను, ఇక నుంచి వారంలో ఏడు రోజులు అందుబాటులోకి తీసుకురావాలని నౌక సంస్థ నిర్ణయించింది.

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఆవడి పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలివేయనున్నారు. ఈ మేరకు విద్యుత్ బోర్డు (ఈబీ) విడుదల చేసిన ప్రకటనలో... ఆవడి పరిధిలోని తిరువళ్లువర్ వీధి, సుబ్రమణియర్ నగర్, తిరుమలై నగర్, మాసిలామణీశ్వర నగర్, ఎట్టియమ్మన్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది.

నేటినుంచి పాఠశాలలు ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన త్రైమాసిక పరీక్షలు గత నెల 27వ తేదీతో ముగిశాయి. అనంతరం ఆయుధ పూజ, విజయ దశమి అంటూ ఐదు రోజులు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. సెలవులు ముగిసి సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రారంభ రోజునే విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలు అందించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

19 జిల్లాల్లో పెరిగిన భూగర్భ జలమట్టం

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గత నెలలో తిరుప్పూర్, ఈరోడ్, కృష్ణగిరి సహా 19 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగాయి. జలవనరుల శాఖ ఆధ్వర్యంలోని భూగర్భ, ఉపరితల జల వనరుల పరిశోధన కేంద్రం ప్రతి నెలా భూగర్భ జలమట్టాలపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తోంది. చెన్నై మినహా, 37 జిల్లాల్లో ఏర్పాటుచేసిన పర్యవేక్షణ బావుల ద్వారా ఈ సర్వే నిర్వహిస్తుంటారు. గత సెప్టెంబరులో, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు, తిరువణ్ణామలై, రాణిపేట, వేలూరు, తిరుపత్తూర్, కృష్ణగిరి, ధర్మపురి, నామక్కల్, ఈరోడ్, తిరుప్పూర్, పుదుకోట, తిరుచ్చి, పెరంబలూర్, తిరువారూర్, నాగపట్టణం, శివగంగ తదితర 19 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగాయని అధికారులు తెలిపారు.

సౌరవిద్యుత్ వ్యాపారంపై శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సౌర విద్యుత్ (సోలార్) వ్యాపారంపై ఈ నెల 8 నుంచి 10వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిక్షణలో... భారత సౌర విద్యుత్ శాఖ, సోలార్ ప్యానళ్లు, ముడి సరుకుపై అవగాహన, పెట్టుబడులు, ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, సౌర విద్యుత్ విక్రయం, వ్యాపారంలో మెళుకువలు తదితరాలపై వివరించనున్నారు. ఈ శిక్షణలో 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండిన వారు పాల్గొనవచ్చు. శిక్షణా కాలంలో తక్కువ అద్దెతో బస,వసతి కల్పించనున్నారు. మరిన్ని వివరాలకు www. editn. in అనే వెబ్‌సైట్, 8668102600, 8072914694 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

8న పెంపుడు శునకాల వ్యాక్సిన్ శిబిరం

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 8న పెంపుడు శునకాలకు రేబిస్ వ్యాక్సిన్ శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... జీసీసీ పరిధిలో పెంపుడు జంతువులకు లైసెన్స్ కోరుతూ 12,393 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపింది. పెంపుడు శునకాలకు ఉచిత వ్యాక్సిన్ శిబిరం నిర్వహించనున్నామని తెలిపింది. ఆ ప్రకారం, తిరువిక నగర్, పులియంతోపు, లాయిడ్స్ కాలని, నుంగంబాక్కం, కన్నమ్మపేట, మీనంబాక్కం తదితర ప్రాంతాల్లోని పెంపుడు జంతువుల చికిత్సా కేంద్రాల్లో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపింది. పెంపుడు జంతువుల యజమానులు chennaicor-poration.-gov.i/gcc/onlineservices అనే వెబ్‌సైట్‌లో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జీసీసీ తెలిపింది.

4,390 బాణసంచా దుకాణాలకు అనుమతి

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 4,390 బాణసంచా దుకాణాలను అనుమతిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 20వ తేది దీపావళి పండుగ రోజున ఆబాలగోపాలం బాణసంచా కాలుస్తుంటారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేయాలనుకునే వ్యాపారులు అగ్నిమాపక, పోలీసు శాఖ, స్థానిక సంస్థల నుంచి ఎన్‌వోసీ పొందాల్సి ఉంటుంది. వీటిలో ముందుగా అగ్నిమాపక శాఖ సర్టిఫికెట్ పొందిన తర్వాతే మిగిలిన శాఖలు సర్టిఫికెట్ ఇస్తాయి. ఈ క్రమంలో, ఈ ఏడాది బాణసంచా దుకాణాల ఏర్పాటుకు 6,578 దరఖాస్తులు అందగా, వాటిలో 4,390 దుకాణాలకు అనుమతులు అందజేశారు. మిగిలిన దరఖాస్తులు పరిశీలించి పది రోజుల్లో అనుమతులివ్వనున్నట్లు, కల్యాణ మండపాలు, ఎమ్యూజ్‌మెంట్ పార్కులు తదితర ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతించలేదని అధికారులు తెలిపారు.

పాత చెక్క సామాన్లు, దుస్తుల సేకరణ: జీసీసీ

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని ఇళ్లు, భవనాల్లో ఉన్న పాత చెక్క సామానులు, దుస్తులు ప్రతి శనివారం సేకరించనున్నారు. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... జీసీసీ పరిధిలో ఇళ్లు, కార్యాలయాలు తదితరాల్లో పోగయ్యే వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు సేకరిస్తుంటారు. ఆ ప్రకారం, జీసీసీ పరిధిలో ప్రతిరోజు సుమారు 6,400 టన్నులు సేకరిస్తుంటారు. ఈ క్రమంలో, ఇళ్లలోని పాత ఫర్నిచర్, దుస్తులు తదితరాలను ప్రజలు రోడ్ల పక్కనే వేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ విషయమై దృష్టి సారించిన జీసీసీ, ఇక నుంచి ప్రతి శనివారం పాత ఫర్నిచర్, దుస్తులు ఇళ్ల వద్దకే వెళ్లి సేకరించాలని నిర్ణయించింది. ప్రజలు 1913 అనే నెంబరు, 9445061913 అనే వాట్సాప్ నెంబరు, 'నమ్మ చెన్నై యాప్' సమాచారం అందిస్తే, కార్మికులు వారి ఇళ్ల వద్దకే వెళ్లి వాటిని సేకరిస్తారని జీసీసీ తెలిపింది.

కంటైనర్ లారీని ఢీకొన్న ఆమ్నీ బస్సు

● బస్సు డ్రైవర్ మృతి, 23 మందికి గాయాలు

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్కాడ్ సమీపంలో ఆదివారం ఉదయం కంటైనర్ లారీని ఆమ్నీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 23 మంది గాయపడ్డారు. రాణిపేట జిల్లా ఆర్కాడ్ సమీపంలోని జాతీయ రహదారిలో చెన్నై నుండి బెంగళూరుకు 25 మంది ప్రయాణికులతో వేగంగా వెళుతున్న ఆమ్నీ బస్సు కాంక్రీట్ స్తంభాల లోడుతో కాంచీపురం నుండి కృష్ణగిరి వెళుతున్న కంటైనర్ లారీ వెనుక భాగాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమ్నీ బస్సు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. బస్సు డ్రైవర్ హరీష్‌కుమార్ ఘటనా స్థలంలోనే మరణించగా, బస్సులో 23 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న ఆర్కాడ్ నగర పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆర్కాడ్ , వేలూరు అడుక్కంపారై ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


నుజ్జునుజ్జయిన ఆమ్నీ బస్సు ముందుభాగం

కోడియక్కరైలో పొరుగు జిల్లాల జాలర్లపై ఆగ్రహం

● 26 మంది మత్స్యకారుల నిర్బంధం

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా కోడియక్కరైలో చేపలవేట సాగిస్తున్న పొరుగు జిల్లాలకు చెందిన 26 మంది జాలర్లను ఆదివారం ఉదయం స్థానిక మత్స్యకారులు నిర్బంధించారు. వీరికి చెందిన ఎనిమిది మరపడవలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వేదారణ్యం సమీపం కోడియక్కరైలో అక్టోబర్‌లో ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాకాలంలో పొరుగు జిల్లాలకు చెందిన జాలర్లు పడవలతో వచ్చి తాత్కాలికంగా బసచేసి చేపలవేట చేయడం ఆనవాయితీ. అయితే పొరుగు జిల్లాల జాలర్లు చేపలు పట్టడంతో తమ ఆదాయానికి గండిపడుతోందని ఆరోపిస్తూ స్థానిక జాలర్లు వారితో ఘర్షణ పడుతుంటారు. ఇలా రెండు వర్గాలకు చెందిన జాలర్లు ఘర్షణకు దిగినప్పుడల్లా అధికారులు జోక్యం చేసుకుని రాజీ కుదుర్చుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువజాము కోడియక్కరైకి రెండు నాటికల్ మైళ్ల దూరంలో చేపలు పడుతున్న పొరుగు జిల్లాలకు చెందిన 26 మంది జాలర్లను స్థానిక జాలర్లు పడవలతో వెళ్ళి చుట్టుముట్టి నిర్బంధించారు. ఆ జాలర్లకు చెందిన ఎనిమిది మరపడవలను స్వాధీనం చేసుకున్నారు. ఆ పడవలను ఆరుకాట్టుతురై చేపలరేవుకు తరలించి లంగరేసారు. సమాచారం తెలుసుకున్న మత్స్యశాఖ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు కోడియక్కరైకి వెళ్ళి స్థానిక మత్స్యకారులతో చర్చలు జరుపుతున్నారు.


ఆరుకాట్టుతురై చేపలరేవులో పొరుగు జిల్లాల జాలర్ల పడవలు

మదురైలో భవనం కూలి వృద్ధురాలి మృతి

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మదురైలో అన్నాడీఎంకే మాజీ కౌన్సిలర్ సుశీంద్రన్‌కు చెందిన మూడంతస్థుల పాత భవనం కూలిపోగా జమీలా (60) అనే వృద్ధురాలు దుర్మరణం చెందగా, ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. విరుదునగర్ జిల్లా రాజపనాశయం ప్రాంతానికి చెందిన జమీలా తన ఇద్దరు మనవరాళ్ళతో కలిసి శనివారం సాయంత్రం మదురై వెళ్ళింది. అక్కడి కంటి ఆస్పత్రిలో చికిత్స అనంతరం అన్నానగర్ యాగప్పానగర్ శక్తిమారియమ్మన్ ఆలయం వద్దనున్న తన సోదరుడి ఇంటికి ఆటోలో బయలుదేరింది. జమీలా తన సోదరుడి ఇంటి ముందు ఆటో నుండి దిగగానే ఆ ఇంటి ముందున్న మూడంతస్థుల పాత భవనం ఉన్నట్టుండి కూలిపోయింది. దీంతో శిథిలాలు పైన పడటంతో ఆమె తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించగా, ఆమె ఇద్దరు మనవరాళ్లు గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకుని అగ్నిమాపక దళం హుటాహుటిన ఆ ప్రాంతానికి వెళ్ళి శిథిలాల మధ్యనున్న జమీలా మృతదేహాన్ని వెలికితీసి, చిన్నారులను రక్షించారు. తహసీల్దార్ పాండి, కార్పొరేషన్ ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.


ఎక్స్‌కవేటర్‌తో శిథిలాలను తొలగిస్తున్న కార్మికులు

ఈపీఎస్‌కు బీజేపీ ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నారు. యాత్ర ప్రారంభోత్సవం ఈ నెల 12వ తేది జరుగనుండగా, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ను బీజేపీ ఆహ్వానించింది. యాత్ర విషయమై శనివారం జిల్లా అధ్యక్షులతో నయినార్ నాగేంద్రన్ నగరంలోని పార్టీ కార్యాలయంలో సమావేశమై చర్చించారు. ఈ విషయమై పార్టీ నేత ఒకరు మాట్లాడుతూ... మదురైలో ఈ నెల 12న నయినార్ నాగేంద్రన్ యాత్ర ప్రారంభం సందర్భంగా బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. ఈ సభలో పాల్గొనాలని ఈపీఎస్‌కు ఆహ్వానం పంపాలని సమావేశంలో నిర్ణయించామని తెలిపారు. అలాగే, యాత్ర జరిగే ప్రతి జిల్లాలో ప్రజలతో సమావేశాలు నిర్వహించి, పార్టీ బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షులకు సూచనలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

యూనిఫాం ఇస్త్రీ చేస్తూ..విద్యుదాఘాతంతో ఎస్ఐ మృతి

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా మనల్‌మేల్‌కుడిలో నివసిస్తున్న మహిళా ఎస్ఐ లక్ష్మీ ప్రియ (33) యూనిఫామ్ ఇస్త్రీ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. లక్ష్మీప్రియ భర్త శక్తి మురుగన్ డి.పళూరులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. దసరా సెలవుల కారణంగా ఇద్దరు పిల్లల్ని వారి బామ్మ ఇంటికి పంపి లక్ష్మీప్రియ ఇంటిలో ఒంటరిగా ఉన్నారు. శనివారం ఉదయం తన యూనిఫామ్‌ను ఇస్త్రీ చేస్తుండగా ఉన్నట్టుండి అందులో విద్యుత్ ప్రసారమైంది. దీంతో కరెంట్‌షాక్‌కు గురై ఆమె ప్రాణాలు కోల్పోయింది. లక్ష్మీప్రియ ఎంతసేపటికీ డ్యూటీకి రాకపోవటంతో ఆమె సహోద్యోగులు ఇంటికి వెళ్ళారు. తలుపులు మూసి ఉండటం, లోపల నుంచి అలికిడి లేకపోవడంతో వారికి అనుమానం కలిగింది. దీనితో వారంతా కలిసి తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్ళి చూడగా లక్ష్మీప్రియ చేతిలో కరెంట్ ఇస్త్రీపెట్టెతో నేలపై శవంగా కనిపించింది. దిగ్భ్రాంతికి గురైన సహోద్యోగులు పోలీసు ఉన్నతాధికారులకు సమా చారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.


ఎస్ఐ లక్ష్మీప్రియ (ఫైల్‌ఫొటో)

ప్రైవేటు స్థలాలు, మైదానాల్లో రోడ్‌షోలు

● రాజకీయ నేతలకు పోలీస్‌శాఖ సలహా

ప్యారీస్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో ఇకపై ప్రైవేటు స్థలాల్లో సభలు నిర్వహించుకోవాలని రాజకీయ పార్టీలకు పోలీసుశాఖ సూచించింది. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా కొన్ని నెలలే వ్యవధి ఉండడంతో ప్రతిపక్షనేత, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, అన్నాడీఎంకే తరపున ప్రారంభించిన ఎన్నికల ప్రచార పర్యటన ఆదివారం 60వ రోజుకు చేరుకుంది. అదేవిధంగా డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత కూడా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఇటీవల కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందగా, 110 మందికి గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో, ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా పోలీసుశాఖ రాజకీయ పార్టీల సభలకు ఆంక్షలు విధించింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి, ప్రేమలత రోడ్‌షోలకు స్టే విధించిన పోలీస్‌శాఖ వాహనాల రాకపోకలకు ఏమాత్రం ఇబ్బంది కలుగని ప్రాంతాల్లో సభలు, రోడ్‌షోలు జరుపుకోవచ్చని, వీలైనంత వరకు ప్రైవేటు మైదానాలు, బహిరంగ ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని సూచించింది. ప్రధానంగా సభలు నిర్వహించే ప్రాంతాల్లో కార్యకర్తలకు తాగునీరు, వైద్యం తదితర కనీస వసతులు కల్పించాలని, ముందు జాగ్రత్త చర్యల కింద అగ్నిమాపకశాఖ, ఆరోగ్యశాఖ, పోలీసు వాహనాలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని పోలీసుశాఖ సూచించింది.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు: టీచర్ అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లాలోని ఓ ప్రాంతంలో ఉన్న మెట్రిక్యులేషన్ పాఠశాలలో పులియంకుళం ప్రాంతానికి చెందిన మణికంఠన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. పాఠశాలలో చదువుతున్న ప్లస్ టూ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయం పాఠశాల అంతటా వ్యాపించడంతో, పాఠశాల యాజమాన్యం అతడిని విధుల నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలో, సదరు విద్యార్థిని అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆమె గర్భవతి అని వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కుమార్తెను ప్రశ్నించగా నిలదీయగా, జరిగిన విషయం తెలిపింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి మణికంఠన్‌ను అరెస్ట్ చేశారు.

మారథాన్ పోటీల్లో యువకుడి మృతి

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన మారథాన్ పోటీల్లో పాల్గొన్న యువకుడు హఠాత్తుగా మూర్ఛపోయి మృతిచెందాడు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేలా కోట్టూరుపురంలోని అన్నా విశ్వవిద్యాలయం నుంచి ఆదివారం ఉదయం మారథాన్ నిర్వహించారు. ఈ మారథాన్‌లో నగరంలోని పలు ప్రాంతాల నుంచి పిల్లలు, యువతీ, యువకులు, మహిళలు, పురుషులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే, తాంబరంకు చెందిన ప్రైవేటు బ్యాంక్ ఉద్యోగి పరమేష్ (24) కూడా పాల్గొన్నాడు. మారథాన్ ప్రారంభమైన కొద్దిసేపటికే పరమేష్ హఠాత్తుగా మూర్ఛపోయాడు. అతడిని వెంటనే అంబులెన్స్ లో రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన కోట్టూరుపురం పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

నీటమునిగి అన్నా, తమ్ముడు...

నీటమునిగి అన్నా, తమ్ముడు మృతిచెందిన ఘటన తిరువణ్ణామలైలో చోటుచేసుకుంది. యువరాజ్ (14) తమ్ముడు దిశాంత్ (8)తో కలసి సమీపంలోని సేత్తుపట్టు చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో దిగి స్నానం చేస్తున్న వారు హఠాత్తుగా లోతైన ప్రాంతానికి వెళ్లి. ఈత తెలియక ఇద్దరూ నీటమునిగారు. గమనించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని గంట పాటు గాలించి మృతదేహాలు వెలికితీసి, పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటనపె పోలీసులు కేసు నమోదుచేశారు.

అత్తను బావిలోకి తోసిన అల్లుడు

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల కారణంగా అత్తను అల్లుడు బావిలో తోసిన ఘటన విరుదునగర్ జిల్లాలో చోటుచేసుకుంది. తుయ్యనూరు గ్రామానికి చెందిన మారిముత్తు, సత్య దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తల మనస్పర్థల కారణంగా సత్య, తన తల్లి ఇరుళాయి (70) వద్ద ఉంటుండగా, ఇద్దరు పిల్లలను ఇరుళాయి సంరక్షిస్తోంది. ఈ క్రమంలో, శనివారం అత్త ఇంటికి వచ్చిన మారిముత్తు, పిల్లలను తనతో పంపించాలని కోరాడు. అందుకు ఇరుళాయి నిరాకరించడంతో, ఆగ్రహించిన మారిముత్తు సమీపంలోని బావిలో ఆమెను తోసివేశాడు. బావిలో నీరు ఉండడంతో ఇరుళాయికి ఎలాంటి గాయాలు కాకపోగా, నీటిలో మునిగిపోతూ కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అందించిన సమాచారంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, బావి నుంచి ఇరుళాయిని వెలికితీసి చికిత్స కోసం అరుప్పుకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై నరికుడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రైలులో మంటలు

● భయంతో వణికిపోయిన ప్రయాణికులు

అడయార్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరువనంతపురం నుంచి చెన్నై వస్తున్న ఒక ఎక్స్‌ప్రెస్ రైలులో అరక్కోణం సమీపంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు భయంతో వణికిపోయారు. ఈ రైలు ఆదివారం ఉదయం 8.26 గంటలకు అరక్కోణం సమీపంలో వస్తుండగా ఏసీ బోగీ కింది భాగంలో మంటలు చెలరేగి, దట్టమైన పొగలు వచ్చాయి. గమనించిన ప్రయాణికులు రైల్వే సిబ్బందికి సమాచారం ఇవ్వగా, మార్గమధ్యంలో రైలు నిలిపివేశారు. ఆ తర్వాత అరక్కోణం నుంచి సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఆ తర్వాత 9 గంటలకు రైలు బయలుదేరి చెన్నై చేరుకుంది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

కరూర్ బాధితుల డిశ్చార్జి

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కరూర్ ఘటనలో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు డిశ్చార్జి అయినట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది. కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందగా, 110 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో 51 మంది ఇటీవల కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 59 మంది కూడా కోలుకుని శనివారం డిశ్చార్జి అయ్యారు. కాగా, తిరుచ్చిలో ఇద్దరు, మదురైలో ఇద్దరు అని నలుగురు మాత్రమే చికిత్సలు పొందుతున్నారని, వారు త్వరలోనే ఆరోగ్యంగా డిశ్చార్జి అవుతారని జిల్లా యంత్రాంగం తెలిపింది.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

వేలూరు, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అరియూర్‌లోని ప్రసిద్ధి చెందిన నారాయణి పీఠం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్య అతిథులుగా నారాయణి పీఠాధిపతి శక్తిఅమ్మ, ఎస్టీ కమిషన్ ఛైర్మెన్ భగవాన్ (తెల్ల కిషోర్) పాల్గొన్నారు. అనంతరం భగవాన్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా నారాయణి పీఠం ఆధ్వర్యంలో ప్రజలకు విద్య, వైద్యసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గొప్పవ్యక్తి పీఠాధిపతి శక్తిఅమ్మ అని కొనియాడారు. అదేవిధంగా అమ్మవారు కొలువైన ఈ స్థలానికి రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని, సుమారు రూ.2కోట్లతో 800 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను తన ద్వారా అందజేయడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. పోలీసు ఉన్నతాధికారి పొన్నిసహా పాఠశాలల నిర్వాహకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థినికి ఉపకార వేతనం అందజేస్తున్న శక్తిఅమ్మ

దినకరన్ అవకాశవాది

● మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్



ప్యారీస్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ అన్నాడీఎంకే కార్యకర్తలను డీఎంకేకు పంపించి పార్టీకి వెన్నుపోటు పొడిచే అవకాశవాది అని మాజీ మంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్ విమర్శించారు. కరూర్ దుర్ఘటనలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్‌కు మద్దతు ప్రకటించడాన్ని దినకరన్ తప్పుబట్టారు. దీనిపై స్పందించిన ఆర్బీ ఉదయ్‌కుమార్ ఆదివారం తన ఎక్స్‌పేజీలో దినకరన్‌ను విమర్శిస్తూ ఈ మేరకు పోస్ట్ చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత కంటికి రెప్పలా కాపాడిన అన్నాడీఎంకేలో చీలికలు ఏర్పడడానికి కారకులు బహిష్కృత నేతలు వీకే శశికళ, టీటీవీ దినకరన్, ఒ.పన్నీర్ సెల్వం అని, ఈ ముగ్గురికి ఈపీఎస్‌ను విమర్శించే హక్కులేదన్నారు. ప్రజలు వరుసగా నిరాకరిస్తున్నా, పట్టించుకోని దినకరన్ రాజకీయాల్లో తన ఉనికిని కాపాడుకోవాలని నాటకాలాడుతున్నారని, ఆయన ఓ అవకాశవాది అని ఉదయ్‌కుమార్ ఘాటుగా విమర్శించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వేలూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాట్పాడి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళ ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులందాయి. కాట్పాడి ఎస్ఐ ఆనందకుమార్ నేతృత్వంలో 20 మంది పోలీసులు శనివారం రాత్రి తమిళనాడు-ఆంధ్ర సరిహద్దులోని క్రిస్టియన్‌పేట చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వేలూరు నుంచి ఆంధ్ర వైపు వెళ్తున్న లారీని ఆపి, అందులో 8 యూనిట్ల ఇసుక గుర్తించారు. పాలారు నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు, కాట్పాడి ఎంజీఆర్ నగర్‌కు చెందిన శ్రీనివాసన్, సంతోష్‌కాంత్‌లను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

కుశస్థలి నదిలో వరద ఉధ్రుతి

తిరుత్తణి, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాపురం అమ్మపల్లి ఆనకట్ట నుండి శుక్రవారం 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం గరిష్ఠంగా 70మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో తిరుత్తణి సమీపంలోని కుశస్థలి నదీలో వరదనీటి ఉధృతి అధికమై నదీ పరివాహక ప్రాంతాల వారిని ప్రజా పనులశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. అదేవిధంగా కృష్ణాపురం జలాశయం నుండి వస్తున్న వరదనీటితో పళ్లిపట్టు ప్రాంతంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. నదీ పరిసర ప్రాంతాల్లో గ్రామాలకు వెళ్లే వంతెనలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయి, ఆ గ్రామాలకు రాకపోకలు అంతరాయం ఏర్పడింది. పోలీస్ అధికారులు వంతెనకు 5 కిలోమీటర్ల ముందు 'నో ఎంట్రీ' బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రజలను వరద ఉధృతి తగ్గేంతవరకు పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ ప్రతాప్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.


కృష్ణాపురం ఆనకట్ట వద్ద వరద ఉధృతి

గంజాయి విక్రయాలు.. యూట్యూబర్, విద్యార్థి సహా నలుగురి అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న యూ ట్యూబర్, కళాశాల విద్యార్థి సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. చూలైమేడు పోలీసులు ఆదివారం ఉదయం కమలా నెహ్రూ నగర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు యువకులను ఆపి ప్రశ్నించగా, వారు పొంతన లేని సమాధానమిచ్చారు. దీంతో, పోలీసులు వారి బ్యాగులు తనిఖీ చేసి గంజాయి, గంజాయి ఆయిల్, మత్తు మాత్రలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... చూలైమేడుకు చెందిన ప్రతాప్ (27), పల్లికరనైకు చెందిన జనార్ధనన్ (27), కీళకట్టలైకు చెందిన పూర్ణచంద్రన్ (21), పూందమల్లికి చెందిన అబ్దుల్ వాసిం (22)గా గుర్తించారు. అలాగే, ప్రతాప్ యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నట్లు, జనార్ధనన్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ని, పూర్ణచంద్రన్ బీబీఏ చదువుతున్నట్లు, అబ్దుల్ వాసి ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారని, వారు బెంగళూరు నుంచి గంజాయి తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు వారిని విచారిస్తున్నారు.

నటులు శ్రీకాంత్, కృష్ణల వద్ద ఈడీ విచారణ

ప్యారీస్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల కేసులో పట్టుబడిన సినీనటులు శ్రీకాంత్, కృష్ణల వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు విచారణ జరపనున్నారు. నుంగంబాక్కంలో ఉన్న ఓ ప్రైవేటు బార్‌లో రెండువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో అన్నాడీఎంకే మాజీ నాయకుడు ప్రశాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని విచారించగా నటుడు శ్రీకాంత్, కృష్ణల వద్ద మాదకద్రవ్యాలు కొనుగోలు చేసినట్లు తెలిసింది. దీంతో వారితో పాటు ప్రశాంత్ మిత్రులు ప్రదీప్‌కుమార్, కెవిన్, ఫయాజ్ అహ్మద్, జవహర్, జాన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో శ్రీకాంత్, కృష్ణ, జాన్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ వ్యవహారంలో నటులు శ్రీకాంత్, కృష్ణ నేరానికి పాల్పడినట్లు పోలీసులు నిరూపించలేదని వారి తరుపు న్యాయవాదులు న్యాయస్థానంలో వాదించారు. అయినప్పటికీ ఈడీ అధికారులు ఈ కేసుపై దర్యాప్తు జరిపేందుకు న్యాయస్థానం నుంచి పొందిన అనుమతితో ప్రస్తుతం పుళల్ జైలులో ఉన్న ప్రశాంత్, జవహర్, ప్రదీప్‌కుమార్, బెయిల్ పొందిన నటులు శ్రీకాంత్, కృష్ణలను త్వరలో విచారణ జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

కాటేసిన పాముతో చికిత్సకు వెళ్లిన రైతు

ప్యారీస్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్ కోవిల్ సమీపంలో తనను కాటేసిన పాముతో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లిన రైతును చూసి సిబ్బంది ఆందోళన చెందారు. మరుదేరి గ్రామానికి చెందిన ముత్తు (38) అనే రైతు ఇటీవల తన పొలంలో పనిచేసుకుంటున్న సమయంలో త్రాచుపాము కాటేసింది. ముత్తు వెంటవున్న అతడి బంధువు ఆ పామును పట్టుకుని సంచిలో బంధించాడు. ఆ సంచితో ముత్తును తీసుకుని చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం వెళ్లారు. వైద్యులు చికిత్స చేయడంతో ముత్తు ప్రాణాపాయ స్థితినుంచి బయటపడినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రజలకు మరింత భద్రత

● బీజేపీ నేత కిరణ్‌కుమార్

తిరుత్తణి, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కొళత్తూరు గ్రామంలోని విజయరాఘవ నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం పళ్లిపట్టు బీజేపీ నార్త్ యూనియన్, పీకాక్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. బీజేపీ పళ్లిపట్టు మండల అధ్యక్షుడు ఎ.కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వీజే.రోహిత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ శ్రీకిరణ్ పాల్గొన్నారు. ఆ ప్రాంతంలోని ప్రజలకు ఆయుష్మాన్‌భారత్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు బీజేపీ నేతలు ప్రభాకర్, మునియప్పన్, ఢిల్లీ, శేషు సహా బీజేపీ నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తున్న కిరణ్ కుమార్

రజనీ కోసమే 'డ్యూడ్' కథ రాశా


హీరో ప్రదీప్ రంగనాథన్‌తో కీర్తీశ్వరన్

● కీర్తీశ్వరన్

ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన 'డ్యూడ్' చిత్రం స్టోరీ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను దృష్టిలో ఉంచుకుని రాశానని ఆ సినిమా దర్శకుడు కీర్తీశ్వరన్ వెల్లడించారు. దీపావళికి రిలీజ్ కానున్న చిత్రాల్లో 'డ్యూడ్' ఒకటి. ఈ నేపథ్యంలో దర్శకుడు కీర్తీశ్వరన్ నగరంలో మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఇది నాకు తొలి చిత్రం. 19 యేళ్ళ వయసులో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. ఇపుడు నా వయసు 27 యేళ్ళు. దర్శకురాలు సుధా కొంగర వద్ద అసిస్టెంట్(ఏడీ)గా పనిచేశాను. ఈ సినిమా కథను ఫొటోగ్రాఫర్ నికేత్ బొమ్మి ద్వారా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలకు వివరించాను. కథ విన్న వెంటనే వారు అంగీకంచారు. హీరోగా ప్రదీప్ రంగనాథన్ పేరు నేనే ప్రతిపాదన చేశా. 'డ్యూడ్' స్టోరీ ప్రారంభించినపుడు... రజనీకాంత్ 30 యేళ్ళ వయసులో ఉంటే ఈ కథలో ఎలా నటించేవారో అనే ఊహించుకుని ఈ స్టోరీ రాశాను. ప్రదీప్ రంగనాథన్ నా ఆలోచనలకు సరిపోయారు. పైగా ఈ స్టోరీ ప్రదీప్ కూడా ఎంతగానో ఇష్టపడ్డారు. ఇందులో ప్రదీప్ రంగనాథన్ సరసన మమిత బైజును ఎంపిక చేశాం. అప్పటికి ఆమె నటించిన 'ప్రేమలు' సినిమా రిలీజ్ కాలేదు. 'సూపర్ శరణ్య' అనే సినిమా చూసి సెలెక్ట్ చేశాం. మమిత కథలోకి రావడంతో 'రజనీ - శ్రీదేవి' కలిసి నటిస్తే ఎలా ఉంటుందో అలా ఈ సినిమా ఉంటుందని అనిపించింది. ఇందులో హీరో హీరోయిన్లు ఈవెంట్స్ మేనేజ్‌మెంట్ కంపెనీ నడుపుతుంటారు. వారి మధ్య ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ. సంగీత దర్శకుడుగా సాయి అభయంకర్‌ను ఎంపిక చేయడానికి కారణం ఉంది. సంగీతంలో ప్రయోగాలకు అమితంగా ఇష్టపడతారు. నేను కూడా ఈ సినిమాలో సంగీతం కొత్తగా ఉండాలని భావించాను. అందుకే సాయిని ఎంపిక చేశాం. సీనియర్ నటుడు శరత్ కుమార్, సీనియర్ నటి రోహిణి, 'పరితాపంగల్' ఫేం డేవిడ్ ప్రధాన పాత్రలు పోషించారు. అని వివరించారు.

గేమ్ డెవలపర్ పాత్రలో శ్రద్ధా శ్రీనాథ్



తన ఆటలో మరింత ముందుకు వెళ్లాలనే పట్టుదలతో సాగే గేమ్ డెవలపర్ పాత్రలో నటిస్తున్నట్టు హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ వెల్లడించారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన వెబ్ సిరీస్ 'ది గేమ్ : యు నెవర్ ప్లే అలోన్'. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. శ్రద్ధా శ్రీనాథ్ సరసన సంతోష్ ప్రతాప్ నటించగా, చాందిని తమిళరసన్ మరో కీలక పాత్ర పోషించారు. ఈ వెబ్ సిరీస్ గురించి శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ, 'తన పనిలో మరింత వృద్ధిలోకి రావాలన్న పట్టుదలతో ఉండే దివ్య అనే గేమ్ డెవలపర్ పాత్రలో నటించాను. సోషల్ మీడియాలో ఏ అంశాన్నైనా ధైర్యంగా మాట్లాడుతుంది. దీంతో దివ్యకు ఒక వైపు మంచి పేరుతో పాటు శత్రువులు కూడా పెరుగుతారు. ఇది ఆమె వ్యక్తిగత జీవితంలో ఎన్నో సమస్యలకు కారణంగా నిలుస్తుంది. వీటి నుంచి తనతో పాటు తన కుటుంబాన్ని, వ్యక్తిగత సమస్యల నుంచి ఎలా గట్టెక్కారన్నదే ఈ వెబ్ సిరీస్ స్టోరీ' అని ఆమె వివరించారు.

సైకలాజికల్ థ్రిల్లర్ 'గేమ్ ఆఫ్ లోన్స్'

జేఆర్‌జీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత జీవానందం డెబ్యూ డైరెక్టర్ అభినేష్ లెస్లీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఆఫ్ లోన్స్'. ఇన్నోవేటివ్ సైకలాజికల్ థ్రిల్లర్ డ్రామాగా తెరకెక్కింది. ఇప్పటికే నిర్మాణ పనులతో పాటు సెన్సార్ సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం ఈ నెల 17వ తేదీ విడుదలకానుంది. ఈ నేపథ్యంలో దర్శక నిర్మాతలు చిత్ర విశేషాలను మీడియాకు వివరించారు. 'ఆధునిక ప్రపంచంలో ఆన్‌లైన్‌లో ఏదైనా కొనుగోలు చేయడం అలవాటుగా వ వా రి పో


'గేమ్ ఆఫ్ లోన్స్'లో ఓ దృశ్యం

యింది. ఇందుకోసం రుణాలు ఇచ్చేందుకు పలు ఆన్‌లైన్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిని సంప్రదించడమే క్షణాల్లో రుణాలు ఇస్తుంటాయి. నిజం చెప్పాలంటే ఆన్‌లైన్ లోన్ యాప్స్ వల్ల ఎంత మేలు ఉందో అంతే స్థాయిలో హాని కూడా ఉంది. ఆన్‌లైన్ లోన్స్‌లో జరిగే గ్యాంబ్లింగ్ ఆధారంగా వినూత్నమైన సైకలాజికల్ థ్రిల్లర్ డ్రామాగా ఈ మూవీ రూపొందించాం. 90 నిమిషాల నిడివితో మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్ షూటింగ్ బెంగుళూరులో పూర్తి చేశాం. హీరోగా నివాస్ ఆదిత్యన్ నటించగా, అభినయ్ ప్రతి నాయకుడి పాత్ర పోషించారు. ఎస్తేర్, బాల నటుడు ఆద్విక్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు.

క్రైం థ్రిల్లర్‌గా 'మౌనం'

మ్యాజిక్ మగ్ మూవీస్ ప్రొడక్షన్స్ పతాకంపై 'మౌనం' అనే టైటిల్‌తో క్రైమ్ థ్రిల్లర్ మూవీ రూపొందనుంది. ఈ చిత్రం పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. ఇందులో సీనియర్ దర్శక నటుడు పార్తిబన్ సహా పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తమిళం, తెలుగు, కన్నడం, మలయాళ భాషల్లో తెరకెక్కించే ఈ చిత్రానికి కన్నడ చిత్రపరిశ్రమకు చెందిన ఏ.మహేష్ కుమార్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించి దర్శకత్వం కూడా చేయనున్నారు. కన్నడంలో 'డ్రాగన్', 'ఊటీ', 'మింజ్ మింజులు' వంటి హిట్ చిత్రాలను


'మౌనం' చిత్రం పూజా కార్యక్రమం

అందించడంతో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వ అవార్డు సైతం అందుకున్నారు. ఈ కొత్త చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో సంప్రదాయ పూజా కార్యక్రమంతో విజయదశమి రోజున ప్రారంభమైంది. ఈ నెల 20వ

నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొత్తం 60 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేసింది. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో షూటింగ్ జరుపనున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడుతూ, 'ఇది ఒక సైలెన్స్ సినిమా. కరోనా కాలంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన హీరోను వెతుక్కుంటూ అతడి మాజీ ప్రియురాలు వస్తుంది. ఆమె వచ్చిన రోజున ఇంట్లో ఉన్న ప్రియుడు తెల్లవారేసరికి హత్యకు గురవుతాడు. ఈ హత్య ఎలా జరిగింది? ఎవరు చేశారు? అన్నదే ఈ చిత్ర కథ. ఒక హార్రర్, మిస్టరీగా ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా చిత్రీకరించనున్నాం' అని తెలిపారు. అభిరామ్ వర్మ, జేఎస్ఆర్ రితిక్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా హీరోయిన్‌ను ఎంపిక చేయాల్సి ఉందని తెలిపారు.

టి.నగర్ 'రామ్‌రాజ్'లో 'రమ్యం' విభాగం ప్రారంభం

● 'సుభగ' పట్టు చీరల ఆవిష్కరణ


'రమ్యం' విభాగాన్ని ప్రారంభిస్తున్న నటి నదియా, కేఆర్ నాగరాజన్, బీఆర్ అరుణ్ ఈశ్వర్, ఆర్తిక అరుణ్ ఈశ్వర్, సుమతి నాగరాజన్ తదితరులు

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ భారతీయ దుస్తుల్లో ప్రసిద్ధి చెందిన 'రామ్‌రాజ్ కాటన్' సంస్థ టి.నగర్ పనగల్ పార్కు ఎదురుగా వున్న తన షోరూంలో 'రమ్యం' పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ప్రముఖ సినీ నటి నదియా, సంస్థ వ్యవస్థాపకులు, ఛైర్మన్ కేఆర్ నాగరాజన్ ఈ విభాగాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బీఆర్ అరుణ్ ఈశ్వర్, డైరెక్టర్లు సుమతి నాగరాజన్, ఆర్తిక అరుణ్ ఈశ్వర్, నటి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రమ్యం విభాగ ప్రారంభోత్సవ అనంతరం ప్రముఖులు 'సుభగ' పేరుతో రూపొందించిన ప్రత్యేక పట్టుచీరలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నదియా మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ పురుషుల దుస్తులకు ప్రసిద్ధి చెందిన రామ్‌రాజ్ సంస్థ.. తాజాగా మహిళల కోసం చీరల విభాగం కూడా ఆవిష్కరించడం సంతోషంగా వుందన్నారు. అద్భుతమైన కలెక్షన్లు అందుబాటులో వుంచారని వివరించారు. రామ్‌రాజ్ కాటన్ తన మూలాలకు కట్టుబడి వుంటూ నిరంతరం నూతన ఆవిష్కరణలు చేపడుతుందని, అందుకే ఆ సంస్థ అగ్రస్థానంలో వుందని హర్షం వ్యక్తం చేశారు. సంస్థ ఎండీ బీఆర్ అరుణ్ ఈశ్వర్ మాట్లాడుతూ.. రమ్యం తమ వినియోగదారులకు చాలా ఇష్టమైన కలెక్షన్లను అందిస్తుందన్నారు. ఒక ప్రత్యేక విభాగాన్ని అందించడం వల్ల దాని వైవిధ్యం, చేతి పనులను మరింత సమర్థవంతంగా ప్రదర్శించడానికి వీలు కల్పిస్తుందన్నారు. సుభగా సిల్క్స్ ప్రారంభంతో సంప్రదాయాన్ని కాలాతీత చక్కదనంతో మిళితం చేసే ప్రత్యేకమైన పట్టు అనుభవాన్ని తమ వినియోగదారులకు అందించడానికి సంతోషిస్తున్నామన్నారు.

శేషవాహనంపై కళింగ వరాహస్వామి

తిరుత్తణి, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని పొదటూరుపేటలో కొలువుదీరిన కళింగ వరాహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో, ఆలయానికి భక్తులు తెల్లవారుజామునుండే పోటెత్తారు. దీపపూజ, పుష్పాలంకరణ తదితర పూజలను అర్చకులు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దేవేరుల సమేతుడైన స్వామివార్ల ఉత్సవమూర్తులను శేషవాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల వేదమంత్రోచ్చారణ, మేళతాళాల నడుమ స్వామివారు పురవీధుల్లో ఊరేగారు.



మొగప్పేర్ వెస్ట్‌లో 'ఏడీకే స్పోర్ట్స్ అండ్ గేమింగ్'


స్పోర్ట్స్ పార్క్ ప్రారంభిస్తున్న సతీష్, రంగనాథన్ తదితరులు

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మొగప్పేర్ వెస్ట్ జస్వంత్‌నగర్‌లోని నెంబరు 8/1 చిరునామాలో 'ఏడీకే స్పోర్ట్స్ అండ్ గేమింగ్ అండ్ పాగేమర్స్ పార్క్' ఏర్పాటైంది. 6500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన పార్క్‌ను ప్రముఖ సినీ నటుడు సతీష్, సంస్థ సీఈవో డీజీ శ్రీనివాసన్, సీవోవో అరుణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రంలో విల్లివాక్కం మాజీ ఎమ్మెల్యే బి.రంగనాథన్, కౌన్సిలర్ ఎ.మాలిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీ శ్రీనివాసన్, అరుణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. చెన్నైకి మొట్టమొదటి స్మార్ట్ స్పోర్టింగ్ అనుభవాన్ని పరిచయం చేస్తున్నామని తెలిపారు. అన్ని వయసుల వారు తమ కేంద్రానికి వచ్చి ఆనందించేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. 2-18 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లల కోసం క్రిస్టల్ క్లీన్ గేమ్ జోన్, సాఫ్ట్ ప్లే, ఆర్కేడ్ గేమ్, మరెన్నో సరదాలను కూడా అందుబాటులో వుంచామని వివరించారు

అట్టహాసంగా సాగిన డాన్ టు డస్క్ మారథాన్


మారథాన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ డీజీపీ డాక్టర్ సి.శైలేంద్రబాబు తదితరులు

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను ఆర్థికంగా ఆదుకునేలా నెవిల్లే ఎండీవర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 'డాన్ టు డస్క్ (డీ2డీ) చెన్నై మారథాన్ 2025' పేరుతో మారథాన్ అట్టహాసంగా కొనసాగింది. ఈ మారథాన్‌లో సుమారు 3500 మంది పాల్గొన్నారు. అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వేకువజాము 5 గంటలకు ఈ మారథాన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి దీనిని ప్రారంభించారు. 25 కి.మీ.లు, 21 కి.మీలు చొప్పున రెండు రకాలుగా ఈ మారథాన్ కొనసాగింది. అన్నా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జె.ప్రకాష్, ఎత్తిరాజ్ మహిళా కళాశాల ఛైర్మన్ ఎం.మురళీధరన్, అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీఈఓ డాక్టర్ కల్పనా బాలకృష్ణన్, డీ2డీ వ్యవస్థాపకుడు నెవిల్లే బిల్మోరియా తదితరులు పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు 16 కి.మీ.లు, 10 కి.మీ.ల, 3 కి.మీల చొప్పున మూడు విభాగాలుగా ఏర్పాటు చేసిన మారథాన్ ప్రారంభ కార్యక్రమంలో మాజీ డీజీపీ డాక్టర్ సి.శైలేంద్రబాబు, నటుడు జంపెడ్ చంద్రకాంత్, పోలీహోస్ ఇండియా సంస్థ ఎండీ షబ్బీర్ యూసఫ్ బాయ్ జమనగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం

● ఐసీఎఫ్ మహోన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల కలయిక


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు నతానియేలు, లక్ష్మీపతినాయుడు

ప్యారీస్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానికి విల్లివాక్కం నియోజకవర్గంలోని ఐసీఎఫ్ మహోన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1978 నుంచి 1982వ సంవత్సరం వరకు తెలుగు మీడియంలో చదువుకుని చెన్నై, తిరుపతి, హైదరాబాద్, హౌరా, ఖరగ్‌పూర్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 30 మందికి పైగా విద్యార్థులు ఐసీఎఫ్ రైల్వే మ్యూజియం ప్రాంగణంలో ఆదివారం ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన లెక్కల మాస్టర్ సీడీ నతానియేలు, తెలుగు మాస్టర్ లక్ష్మీపతినాయుడులను ఘనంగా సత్కరించి వారి ఆశీసులందుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తమ అనుభవాలను గురువులతో ఉన్న అనుబంధాలను నెమరువేసుకున్నారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ, అమ్మఒడిలో జన్మించిన మనం బడిలో గురువుల బోధనలతో ఉత్తమ పౌరులుగా మరో జన్మపొందుతామని, ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యనేర్పిన గురువులను పూజించడం గొప్ప శుభసూచికమన్నారు. ఈ నాలుగో వార్షిక పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం ప్రసంగాలు, ఆటలు, పాటలు, నృత్యం, గేమ్స్, బహుమతుల ప్రదానంతో సందడిగా సాగింది.


శ్రీవారి కల్యాణ ఘట్టం

వైభవంగా శ్రీనివాస తిరుకల్యాణం

ప్యారీస్, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు పటేల్‌రోడ్డులోని వేంకటేశ్వర భక్త సమాజం ఆధ్వర్యంలో శ్రీనివాస తిరుకల్యాణం కన్నులపండువగా జరిగింది. సమాజం 56వ వార్షిక తిరుకల్యాణం వేడుకలు గత నెల 27న ప్రారంభమై ఆదివారం శ్రీవాని కల్యాణంతో ముగిశాయి. శనివారం సాయంత్రం 5 గంటలకు దీపపూజ, సాయంత్రం 6.30 గంటలకు వరుడి ఆహ్వానం, గరుడ వాహనంలో స్వామివారి ఊరేగింపు జరిగాయి. ఆదివారం ఉదయం తిరుమంజనం, కాశీయాత్ర, మాలల మార్పిడి, ఊంజల్‌సేవ, కళాకారుల నృత్య ప్రదర్శన, మాంగళ్యధారణ, మహాదీపారాధన కార్యక్రమాలను వేద మండితులు మంత్రోచ్చారణ, మేళతాళాలు, గోవిందనామస్మరణ మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికి తీర్థ, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు, సమాజం అధ్యక్షుడు తమ్మినేని బాబు, కార్యదర్శి ఎస్.వెంకటరామన్, జాయింట్ సెక్రటరీలు హెచ్.అనంతరామన్, పి.రవికుమార్, కోశాధికారులు పి.కోదండరామయ్య, హెచ్.వెంకటరమణ, ట్రస్టీ పి.రామచంద్రన్, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణోత్సవానికి సహకరించిన దాతలు, పుర ప్రముఖులను సత్కరించారు. కాగా, ఈ నెల 12న సుమారు వెయ్యి మంది పైగా భక్తులు పెరంబూరు నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లనున్నట్లు తమ్మినేని బాబు తెలిపారు.

కీల్‌కట్టలైలో జయచంద్రన్ షోరూమ్ ప్రారంభం


షోరూమ్ ప్రారంభిస్తున్న దృశ్యం

అడయార్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మడిబాక్కం సమీపంలోని కీల్‌కట్టలైలో వస్త్ర ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన జయచంద్రన్ షోరూం ఏర్పాటైంది. జయచంద్రన్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ ఎస్.జయచంద్రన్, జయ జానకీ దంపతులు ఆదివారం ఉదయం ఈ షోరూంను లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారి పెద్ద కుమారుడు సుందరలింగం, పెద్ద కోడలు మీనా, మనవడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. వస్త్ర రంగంతో పాటు బంగారు ఆభరణాలు, ఫర్నిచర్, అలంకరణ సామగ్రి, చర్మ సౌందర్య ఉత్పత్తుల వంటి ఎన్నో రకాల వ్యాపారాల్లో పేరొందిన జయచంద్రన్ సంస్థకు స్థానిక టి.నగర్ రంగనాథన్ వీధి, ఉస్మాన్ రోడ్డు, పల్లికరణై, తాంబరం తదితర ప్రాంతాల్లో కూడా భారీ షూరూంలున్న విషయ తెలిసిందే. ఆదివారం కీల్‌కట్టలై షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వాహకులు వినియోగదారులకు అన్ని విక్రయాలపై పది శాతం రాయితీ ఇచ్చారు. అదే విధంగా తొలి రోజు వెయ్యి మందికి పైగా వినియోగదారులకు స్లోగన్ కాంటెస్ట్ నిర్వహించి కారు, బైక్ వంటి ఎంతో విలువైన బహుమతులను కూడా అందించారు. ఈ షోరూం రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయడం విశేషం.

'ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్'లో 'తస్వా' స్టోర్

చెన్నై, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో ఆధునిక భారతీయ పురుషుల కోసం, ప్రముఖ పెళ్లిదుస్తుల బ్రాండ్ అయిన 'తస్వా' స్టోర్ ఏర్పాటైంది. ప్రముఖ నటుడు హరీష్ కల్యాణ్, సంస్థ నిర్వాహకులు అజయ్ భాత్రా, బ్రాండ్ హెడ్ ఆశిష్ ముకుల్ తదితరులు దీనిని ఇటీవల లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి ఆధునిక యువతకు ఈ స్టోర్ ప్రత్యేకమైన షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందనడంలో సందేహం లేదన్నారు. భారతీయ యువత అభిరుచులకు అనుగుణంగా దుస్తులు అందిస్తున్నామన్నారు. ఈ స్టోర్ దక్షిణ భారతదేశంలో ముఖ్యమైన మైలురాయి సూచిస్తుందని, చెన్నై గొప్ప సాంస్కృతిక వారసత్వం, ఫ్యాషన్, జీవనశైలికి కేంద్రంగా వుంటుందని వివరించారు.


స్టోర్ ప్రారంభిస్తున్న అజయ్ భాత్రా, హరీష్ కల్యాణ్

గ్రామస్తులకు హీరో ధనుష్ విందు


గ్రామస్తులతో కలిసి విందు ఆరగిస్తున్న ధనుష్ కుటుంబ సభ్యులు

అడయార్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హీరో ధనుష్ తన సొంతూరులో కులదైవానికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామ ప్రజలకు విందు భోజనం ఏర్పాటు చేశారు. వారితో కలిసి ఆయన భోజనం చేశారు. ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'ఇడ్లీకడై' చిత్రం ఈ నెల ఒకటో తేదీన విడుదలై విజయం సాధించింది. ఈ నేపథ్యంలో తన కులదైవ ఆలయం ఉన్న తేని జిల్లా శంకాపురం గ్రామంలో ధనుష్ ఈ విందు ఏర్పాటు చేశారు.